పాడేరులో ఓటు వేస్తున్న కలెక్టర్ విజయ సునీత

మన్యంలో మందకొడిగా పోలింగ్

పాడేరులో 45.78, అరకులో 55.85, రంపచోడవరంలో 59.25 శాతం పోలింగ్

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియ అల్లూరి జిల్లాలో సోమవారం మందకొడిగా ప్రారంభమైంది. చివర్లో వరునుడితో అంతరాయం ఏర్పడింది. ఉదయం ఏడు గంటలకే పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైనప్పటికీ పోలింగ్ కేంద్రాల్లో కొన్నిచోట్ల ఈవీఎంల మొరాయింపు, ఓటర్ల వివరాల పరిశీలన, ఓటర్ల సంతకాల సేకరణ వంటి ప్రక్రియ నిర్వహణలో కాస్తంత జాప్యం జరుగుతూ పోలింగ్ ప్రక్రియ చాలా నెమ్మదిగా మొదలయ్యింది.

ప్రజాశక్తి-పాడేరు:

పోలింగ్ ప్రక్రియ ఏడు నుంచి తొమ్మిది గంటల వరకు రెండు గంటలు సేపు పూర్తయ్యేసరికి అరకు 7 శాతం, పాడేరు 5.6 శాతం, రంపచోడవరం 7.6శాతం మాత్రమే జరిగింది. పోలింగ్ కేంద్రాల వద్ద ఏడు గంటల నుంచి బారులు తీరిన ఓటర్లకు ఎక్కువైంది. మినుములూరు పోలింగ్ కేంద్రం వద్ద క్యూలో నిల్చున్న మహిళలు పోలింగ్ జాప్యం కొంతసేపు కూర్చుంటూ కొంతసేపు నిల్చుంటు పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్లాల్సి వచ్చింది. ఈ పోలింగ్ కేంద్రంలో పోలింగ్ సమయం పూర్తయిన తర్వాత కూడా ఇంకా ఓటర్లు బారులు తీరి ఉన్నారు.

జిల్లాలో మధ్యాహ్నం తర్వాత పోలింగ్ ఊపందుకుంది. 9 నుంచి 11 గంటల వరకు అరుకు 17.9శాతం, పాడేరు 14.3శాతం, రంపచోడవరం 22 శాతానికి పెరిగింది. మధ్యాహ్నం ఒంటిగంట సమయానికి అరకు 32.46శాతం. పాడేరు 31.38శాతం, రంపచోడవరం 34.43శాతం, సాయంత్రం మూడు గంటల సమయానికి అరకు 51.శాతం, పాడేరు 40.12శాతం, రంపచోడవరం 54.11శాతం పోలింగ్ పూర్తయింది. పోలింగ్ పూర్తయ్యే సమయానికి అరకు 55. 85శాతం పాడేరు 45.78శాతం, రంపచోడవరం 59.25శాతం కు చేరింది..

పోలింగ్ కు వరుణుడి అంతరాయం...

జిల్లాలోని పాడేరు ఏజెన్సీలో సోమవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం నాలుగున్నర గంటల వరకు కురిసిన కుండపోత వర్షంతో పోలింగ్ కు అంతరాయం కలిగింది. పాడేరు పరిశ్రమ ప్రాంతాల్లో వర్షం ముంచెత్తడంతో మధ్యాహ్నం నుంచి ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వెళ్లలేకపోయారు. దీని ప్రభావం పోలింగ్ పై తీవ్రంగా కనిపించింది. పాడేరు అసెంబ్లీ నియోజకవర్గంలో గతంలో పలుసార్లు 55 నుంచి 60 శాతం వరకు పోలింగ్ జరిగింది. పాడేరులో పోలింగ్ కేవలం 45.78 మాత్రమే జరగడం పట్ల రాజకీయ పార్టీల నాయకులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. దాదాపుగా పది శాతానికి పైగా పోలింగ్ తగ్గిపోవడం గమనార్హం.

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

పాడేరు:అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో సోమవారం జరిగిన పోలింగ్ సరళి పై జిల్లా ఉన్నతాధికారులు, పోలీస్ యంత్రాంగం పర్యవేక్షణలో కొనసాగింది. జిల్లా కలక్టర్ ఎం.విజయ సునీత తన ఓటు హక్కును పాడేరులో వినియోగించుకున్నారు. కలక్టర్ బంగ్లాకు సమీపంలో ఉన్న శ్రీకృష్ణాపురం గిరిజన సంక్షేమ ప్రభుత్వ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా కలక్టర్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు వజ్రాయుధం అని, ఓటు కలిగిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వినియోగించుకోవాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలింగ్ కేంద్రాలను సందర్శించారు.

మినుములూరు కేంద్రం వద్ద ఉన్న ఓటర్లు

పాడేరు, రంప చోడవరం, అరకు అసెంబ్లీ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు వివిధ పోలింగ్ కేంద్రాల్లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అరకు పార్లమెంట్ సిపిఎం అభ్యర్థి పాచిపెంట అప్పలనరస తన స్వగ్రామం బొండం పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. అసెంబ్లీ వైసీపీ అభ్యర్థి వేగం మత్స్యలింగం స్వగ్రామం కొంతిలిలోనూ, పాడేరు అసెంబ్లీ టిడిపి అభ్యర్థి గిడ్డి ఈశ్వరి తలారిసింగి పోలింగ్ కేంద్రం, వైసిపి అభ్యర్థి విశ్వేశ్వర రాజు గుడి వాడ పోలింగ్ కేంద్రం, కాంగ్రెస్ అభ్యర్థి

ఓటు వేసేందుకు డోలీలో..

అనంతగిరి: రోడ్డు సౌకర్యం లేక డోలీలతో వినూత్న రీతిలో నిరసన చేపడుతూ, తమ ఓటును వినియోగించుకునేందుకు గిరిజనులు తరలి వెళ్లారు. నాన్ షెడ్యూలు రొంపలి పంచాయితీ బూరిగా, చిన్నకోనల గ్రామాలకు చెందిన సుమారు 150 మంది పైగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు సుమారు 12 కిలోమీటర్లు పైగా కొండ కోనల నడుమ నుండి పెదరాబా, రొంపల్లి పోలింగ్ కేంద్రాలకు వెళ్లారు.చంటి పిల్లను తలులు ఎత్తుకొని అవస్థలు పడుతూ వెళ్లారు. ప్రభుత్వం రోడ్డు సౌకర్యం కల్పించాలని వార్డు మెంబర్ సోమ్మెల అప్పలరాజు, గ్రామస్తులు జోగయ్య డిమాండ్ చేశారు.

డోలీలో తీసుకెళుతున్న కుటుంబీకులు

అరకులోయ:సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతగా ముగిసాయి. అరకు వ్యాలీ అసెంబ్లీ నియోజక వర్గం పరిధిలోని ఆరు మండలాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విజయవంతంగా పోలింగ్ ప్రక్రియ నిర్వహించారు. ఉదయం 5.30 గంటలకు మాక్ పోలింగ్ నిర్వహించారు. 7 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. 9గంటలకు 7శాతం, 11 గంటలకు 17.93 శాతం, మధ్యాహ్నం 1 గంటకు 32.46 శాతం, 3 గంటలకు 51.80 శాతం ఓటింగ్ పూర్తయ్యింది. సాయంత్రం నాలుగు గంటలకు 55.85 శాతం నమోదయ్యింది. తుది ఓటింగ్ శాతం ప్రకటించాల్సి ఉంది. అరకు వ్యాలీ అసెంబ్లీ నియోజక వర్గం పరిధిలో 17 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. అరకు వ్యాలీ నియోజక వర్గంలో 304 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేసారు. 2.45 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. మహిళలు 1.26 లక్షల మంది, పురుషులు 1.19 లక్షల మంది, థర్డ్ జెండర్లు ఏడుగురు ఉన్నారు. అరకు వ్యాలీ అసెంబ్లీ నియోజక వర్గం రిటర్నింగ్ అధికారి, ఐటిడిఏ పిఓ వి.అభిషేక్ నిరంతరం పోలింగ్ సరళిని పర్యవేక్షించి పోలింగ్ అధికారులకు పలు సూచనలు చేసారు.

అరకులోయలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న పిఒ అభిషేక్

గొందూరు పోలింగ్ కేంద్రంలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు

వెబ్ క్యాస్టింగ్‌ను పరిశీలన

కలక్టరేట్ జిల్లా కమాండ్ కంట్రోల్ కేంద్రంలో ఏర్పాటు చేసిన వెబ్ కేస్టింగ్‌ను సాధారణ పరిశీలకులు కె. వివేకానందన్, జిల్లా ఎన్నికల అధికారి, కలక్టర్ ఎం. విజయ సునీత, సబ్ కలక్టర్ ధాత్రి రెడ్డి పరిశీలించారు.

జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న పోలింగ్ సరళిని పర్యవేక్షించారు.

కమాండ్ కంట్రోల్ కేంద్రం తనిఖీ

జిల్లా కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని సాధారణ పరిశీలకులు కె.వివేకానందన్ తనిఖీ చేశారు. ఎన్నికలకు సంబంధించిన ప్రకటనలు, పెయిడ్ న్యూస్, సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్ తదితర అంశాల పై ఆరా తీశారు. బోర్డర్ చెక్ పోస్టుల వెబ్ కాస్టింగ్, టివి చానళ్ళను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ బి.పద్మావతి, నోడల్ అధికారులు పి.గోవిందరాజులు, పి. రాములు, రమేష్ కుమార్ రావు, రామకృష్ణ, ఎల్.బి. వెంకట రావు తదితరులు పాల్గొన్నారు

జిల్లాలో వివిధ ప్రాంతాలలో పలువురు పిడబ్ల్యుడి ఓటర్లు ఉత్సాహంగా ఓటింగులో పాల్గొన్నారు. పెదబయలు మండలం గొమంగి పోలింగ్ కేంద్రములో విభిన్న ప్రతిభావంతుడైన ఓటరు తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదే విధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన 278వ పోలింగ్ కేంద్రములో కొట్టగుల్లి మహేష్ బాబు అనే 23 సంవత్సరముల పిడబ్ల్యుడి ఓటరు తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.



కేంద్రాన్ని పరిశీలిస్తున్న జెసి

పోలింగ్ కేంద్రాలను జేసి సందర్శన

పాడేరు రిటర్నింగ్ అధికారి జేసి భావన వసిష్ట్ జీ. మాడుగుల మండలంలో పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి నియోజకవర్గంలో పోలింగ్ సరళిని పరిశీలించారు. జీ. మాడుగుల మండలం సెక్టార్ 42లో గల 234, 236, 238, 240, 243, 244, 245 నంబర్ల గల పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని పర్యవేక్షించారు.

వెనుతిరిగిన ఓటర్లు..

పాడేరు:పాడేరు అసెంబ్లీ నియోజకవర్గం చింతపల్లి మండలం రింతాడ గ్రామంలో 29, 30 పోలింగ్ బూత్ లో ఈవీఎం మిషన్ల సాంకేతిక లోపం, భారీ వర్షం కారణంగా పోలింగ్కు అంతరాయం ఏర్పడింది. సాయంత్రం 6:30 గంటల సమయం దాటిపోవడంతో క్యూలో ఉన్న ఓటర్లు ఓటు హక్కును వినియోగించు కోకుండా ఇళ్లకు వెనుతిరిగి వెళ్ళిపోయినట్లు స్థానికులు తెలిపారు.

రంపచోడవరంలో పోలింగ్ ప్రశాంతం

పలు చోట్ల ఇవిఎంలు మొరాయింపు
గంటల తరబడి క్యూలైన్లలో నిరీక్షించిన ఓటర్లు

దేవీపట్నం మండలంలో ఓటు వేయడానికి క్యూ లైన్లలో ఉన్న ఓటర్లు

ప్రజాశక్తి- విలేకర్ల యంత్రాంగం

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం రంపచోడవరం నియోజకవర్గం పరిధిలో ప్రశాంతంగా జరిగింది. సమస్యాత్మక ప్రాంతాల్లో సైతం ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే పలు చోట్ల ఈవిఎంలు మొరాయించడంతో ఓటర్లు గంటల కొద్దీ క్యూలైన్లలో నిరీక్షించాల్సి వచ్చింది.

రంపచోడవరం : రంపచోడవరం నియోజకర్గంలోని 399 పోలింగ్ కేంద్రాల్లో సుమారు 232 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉండగా అందులో 10 అత్యంత సమస్యాత్మకమైనవి ఉండగా, వీటిలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. రంపచోడవరం పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు బారులు తీరి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వై.రామవరం మండలం ఎగువ గుర్తేడు, పాతకోట, బొడ్డగండి పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఎన్నికల సామాగ్రి హెలీకాప్టర్ ద్వారా స్ట్రాంగ్ రూమ్‌కు సాయంత్రం 5 గంటలకు తీసుకొచ్చారు. విఆర్.పురం మండలంలోని తుమ్మిలేరు పోలింగ్ కేంద్రం నుండి పడవలో ప్రయాణం చేసి ఎన్నికల సామాగ్రి తీసుకురావడం జరిగింది. మండల కేంద్రంలో రిటర్నింగ్ అధికారి ఎస్ ప్రశాంత్ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు సీతంశెట్టి వెంకటేశ్వరరావు, బాబు రమేష్, మాజీ రాజ్యసభ సభ్యురాలు టి.రత్నాబాయి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రంపచోడవరం అడిషనల్ ఎస్పీ జగదీష్ హెచ్. పర్యవేక్షించి పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చే ఎన్నికల సామాగ్రిని స్ట్రాంగ్ రూములో భద్రపరిచే విధంగా ఎన్నికల పరిశీలకులు పంకజ్ సింగ్, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే, రిటర్నింగ్ అధికారి యస్. ప్రశాంత్ కుమార్, చింతూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కావూరి చైతన్య, పర్యవేక్షించారు. ఎన్నికలు సజావుగా ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నరు.

నియోజకవర్గంలో పోలింగ్ సరళి

ఉదయం 7 నుండి 9 గంటల వరకు 7.61శాతం, 9 నుండి 11 గంటల వరకు 23.06 శాతం, 11 నుండి ఒంటి గంట వరకు 34.43 శాతం, ఒంటి గంట నుండి 3 గంటల వరకు 54.11 శాతం, మూడు గంటల నుండి 7 గంటల వరకు 66.32 శాతం ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడం జరిగిందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రశాంత్ కుమార్ తెలిపారు.

చింతూరు : చింతూరు మండలంలో మొత్తం 30,313 మంది ఓటర్లు ఉండగా, మొత్తం 40 పోలింగ్ బూత్లను ఏర్పాటు చేశారు. ఉదయం 7 గంటల నుండి ఓటింగ్ ప్రారంభమవుతుందని ఓటర్లు తెల్లవారుజాము నుండే స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లకు చేరుకున్నారు. అయితే ఈవీఎంలు మొరాయించడంతో ఓటర్లు గంటన్నర పాటు క్యూ లైన్‌లో నొల్చొని ఇబ్బందులకు గురయ్యారు. 347, 348 పోలింగ్ బూత్లలో భారీ సంఖ్యలో ఓటర్లు క్యూలో నిలవడంతో కొంతమంది విసుగు చెంది ఓటు వేయకుండానే వెనుతిరిగారు. ఈవీఎంలు మోరాయించిన కారణంగా ఓటింగ్ శాతం మందకోడిగా సాగడంతో సాయంత్రానికి 59.80శాతం పోలింగ్ నమోదైంది. చింతూరు ఎఎస్పి రాహుల్ మీనా ఎన్నికల తీరును పరిశీలించారు. ఎస్సై శ్రీనివాస్ కుమార్ తన సిబ్బందితో ఎన్నికల నిర్వహణలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతను ఏర్పాటు చేశారు.

దేవీపట్నం : దేవీపట్నం మండలంలోని పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఇందుకూరుపేట, ఇందుకూరు, కమలంపాలెంలో ఓటర్లు తమ హక్కును వినియోగించుకున్నారు. గోకవరం పరిసర ప్రాంత పోలవరం నిర్వాసితులు ఇందుకూరుపేటలో ఓటు వేశారు. మారుమూల ప్రాంతమైన ఎర్రమెట్ల, పెద్ద నోతులు పావుగండి గ్రామాల్లో అధిక సంఖ్యలో ఓట్లు వేశారు.

మారేడుమిల్లి : మండలంలో సోమవారం నిర్వహించిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 7 గంటల నుండి పోలింగ్ నిర్వహించాల్సి ఉండగా, మండలంలో కొన్ని బూతుల్లో ఆలస్యంగా ప్రారంభమైంది. మారేడుమిల్లి, కుట్రవాడ, లోతట్టు బూతులలో ఈవీఎంలు కొంచెం ఇబ్బంది పెట్టాయి. మారేడుమిల్లిలో ఓటర్లు ఉదయం నుండి పోలింగ్ బూత్ వద్ద బారులు తీశారు. క్యూలైన్లో నిలుచున్న కొంతమంది ఎండ వేడిమికి తట్టుకోలేక వెనుతిరిగారు. మళ్లీ మధ్యాహ్నం మూడు గంటలకు పోలింగ్ కేంద్రాలకు వద్దకు అధిక సంఖ్యలో ఓటర్లు చేరుకోగా నాలుగు గంటలకు ముగించాల్సిన పోలింగ్ 5 గంటల వరకు సాగింది. మండల తహాశీల్దారు వెంకటరమణ, ఎస్సై రాము ఎటువంటి అవాంఛ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

సమస్యలపై పోలింగ్ బహిష్కరణ

- నాయకులు, మీడియా జోక్యంతో ఓటింగ్

కూనవరం : తమ గ్రామంలోని సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండలంలోని కాచవరం ఎస్‌సి కాలనీ వాసులు సోమవారం నాటి ఎన్నికల పోలింగ్‌ను బహిష్కరించారు. తమ భూములకు పట్టాలు మంజూరు చేయాలని కోరారు. సరైన రోడ్లు లేక అవస్థలు పడుతున్నామని, రోడ్లు వేయాలని, పక్కా ఇళ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై ఎన్నిసార్లు విన్నవించినా, ఏళ్ళు గడుస్తున్నా పట్టించుకునే నాధుడు లేరని వాపోయారు. తమ సమస్యలను పరిష్కరించేంత వరకు ఓటు వేసేది లేదని తేల్చి చెప్పారు. చివరికి నాయకులు, మీడియా జోక్యం చేసుకోవడంతో సాయంత్రం 4 గంటలకు ఓట్లు వేసినట్లు తెలిసింది.

నినాదాలు చేస్తున్న కాచవరం ఎస్‌సి కాలనీ వాసులు

విఆర్.పురం మండలం, శ్రీరామగిరికి ఓటు వేసేందుకు గోదారిలో బోటుపై వస్తున్న కల్తునూరు గ్రామస్తులు

విఆర్.పురం : మండలం మొత్తం 80శాతం పోలింగ్ నమోదైంది. గిరిజన ప్రాంత మండలాల్లో సాయంత్రం నాలుగు గంటల వరకే పోలింగ్ సమయం నిర్ణయించడంతో కొంతమంది తమ ఓటు హక్కును ఉపయోగించుకోలేకపోయామని వాపోయారు. మండలంలోని శ్రీరామగిరి, చిన్నమట్టపల్లి గ్రామాలలో కొన్నిచోట్ల ఈవీఎంలు మొరాయించటంతో ప్రజలు క్యూ లైన్‌ల్లో గంటల తరబడి నిలబడవలసి వచ్చింది. ముంపు ప్రాంతం కొల్లూరు, గొందూరు కల్తునూర్ గ్రామాల ప్రజలు పడవలపై ప్రయాణించి తుమ్మిలేరు, శ్రీరామగిరిలోని పోలింగ్ కేంద్రాల్లో తమ ఓటు హక్కును ఉపయోగించుకోవడం విశేషం.

రాజవొమ్మంగి : మండలంలోని రాజవొమ్మంగి, అనంతగిరి పోలింగ్ బూతుల్లో ఈవీఎంలు పనిచేయక ఓటర్లు గంటల తరబడి క్యూలో నిలబడవలసిన పరిస్థితి ఏర్పడింది. ఓటర్ స్లిప్పులు అందక, ఏ బూత్‌లో ఓటు వేయాలో తెలియక చాలామంది ఓటు వేయకుండా వెనుదిరిగారు. రాజవొమ్మంగి 75వ బూత్‌లో ఈవీఎం ప్యాడ్‌ను మార్చారు. మండలంలోని లబ్బర్తి గ్రామంలో సమయం అయినప్పటికీ చాలా మంది ఓటర్లు క్యూలో ఉండడంతో సాయంత్రం 6.30 తరువాత కూడా పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. మొత్తంగా మండలంలోని 65శాతం పోలింగ్ నమోదైంది. మండలంలోని జట్టంగి పోలింగ్ బూత్ వద్ద ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మితో బాటు వైసిపి నాయకులు రావడాన్ని గ్రామస్తులు అడ్డుకున్నారు. నాయకులకు ప్రవేశం లేదని ఘర్షణ పడ్డారు. అధికారులు ఇరువురిని సమదాయించారు.

కూనవరం : మండలంలో పోలింగ్ ప్రశాంతంగా సాగింది.16595 మొత్తం ఓటు హక్కు వినియోగించుకున్నారు. 81.50 పోలింగ్ శాతం నమోదైంది.

ఎటపాక : మండలంలోని చాలాచోట్ల పోలింగ్ ఆలస్యంగా మొదలైంది. ఓటు వేయడానికి ఉదయాన్నే పోలింగ్ బూత్‌లకు వచ్చినవారు ఈవిఎంలు మొరాయించడంతో తీవ్ర అసహనానికి గురయ్యారు. పోలింగ్ ప్రారంభమయ్యే సరికి క్యూలైన్లలో ఓటర్లు బార్లు తీరారు. పోలింగ్ మందకొడుగా జరుగుతుండడంతో పోలింగ్ సిబ్బందితో ఓటర్లు వాగ్వివాదానికి దిగారు. సరైన సౌకర్యాలు లేక మండుటెండలో నిలబడలేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మండలంలో42 బూత్‌ల్లో 33,409 ఓటర్లు ఉండగా 25,562 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 76.51 శాతం ఓటింగ్ నమోదైంది.

అడ్డతీగల : మండలంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలింగ్ ప్రశాంతంగా సాగింది. మండలంలో మొత్తం 32,458 మంది ఓటర్లు ఉండగా, సాయంత్రం నాలుగు గంటలకు 19 953 ఓట్లు పోలైనట్లు తహశీల్దారు నాగమణి తెలిపారు. ఉదయం ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ 8:45 గంటలకు ప్రారంభమైంది. వేటమామిడి పంచాయతీ పలుకురాతిపాలెం గ్రామంలో 18 ఓట్లు పోలైన తర్వాత ఈవీఎం పూర్తిగా మొరాయించడంతో ఆ ఈవీఎంను మార్చడం జరిగింది. ధాన్యం పాలెం పంచాయతీ పెద్ద ములకలగడ్డ గ్రామంలో ఉదయం 9.45 గంటలకు కూడా పోలింగ్ ప్రారంభం కాలేదు. దీంతో అధికారులు ఇవిఎంను, సిబ్బందిని మార్చడం జరిగింది. డి.భీమవరం పంచాయతీ నిమ్మలపాలెం గ్రామంలో ఈవీఎం మోరాయించడంతో ఓటర్లు అసహనానికి గురయ్యారు. ఇవిఎంల మోరించడం కారణంగా కొత్తూరు ధాన్యం పాలెం పోలింగ్ బూతుల్లో రాత్రి 8.30 గంటలకు కూడా పోలింగ్ కొనసాగుతుంది.

వై.రామవరం : మండలంలోని 22,231 మంది ఓటర్లు ఉండగా, 13714 ఓట్లు నమోదయ్యాయి. 55శాతం పోలింగ్ నమోదైంది. ఎన్నికల నిర్వహణలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఓటు వేసి, ప్రాణం విడిచిన మహిళ

రేగులపాడులో విషాదం

ప్రజాశక్తి-కూనవరం

మండలంలోని రేగులపాడు గ్రామంలో సోమవారం విషాదం చోటుచేసుకుంది. ఓటు వేసి వచ్చిన మహిళ వడదెబ్బ తగిలి మృత్యువాడ పడింది. బంధువులు తెలిపిన వివరాలు ప్రకారం... రేగులపాడు గ్రామానికి చెందిన పైదా పార్వతి (42) అనే మహిళ సోమవారం తన ఓటు హక్కు వినియోగించుకొనేందుకు స్థానిక పోలింగ్ స్టేషన్‌కి వెళ్ళింది. అక్కడ క్యూ లైన్లో ఎండలో ఎక్కువ సేపు నిలబడి ఓటు వేసి ఇంటికి వచ్చారు. ఎండవేడికి వడదెబ్బ తగలి ఇంటికి వచ్చిన వెంటనే స్పృహ తప్పి పడిపోయారు. దీంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. ఇవిఎంలు ఎక్కువ సేపు మొరాయించడంతో క్యూ లైన్‌లో అధిక సమయంలో ఎండలో నిలబడటం వల్లే ఈ సంఘటన చోటుచేసుకుందని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

పార్వతి మృతదేహం

ఓటర్ లిస్టులో పేర్లు లేవంటూ కిర్రాబు గ్రామస్తుల ఆవేదన

రాజవొమ్మంగి : ఓటర్ లిస్టులో తమ పేర్లు లేవంటూ మండలంలోని కిర్రాబు గ్రామానికి చెందిన 15 మంది సోమవారం ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గతంలో తమ 15 మంది పేర్లు భరతనాంపల్లి పంచాయతీలో ఉండేవని, పంచాయతీ ఎన్నికల్లో ఓట్లు కూడా వేసామని చెప్పారు. అయితే కిర్రాబు గ్రామంలో ఓట్లు ఉన్నాయని తమ పేర్లను భరతనాంపల్లి పంచాయతీలో తొలగించినట్లు అధికారులు చెప్పారని, కాని ఇక్కడ ఓటర్ లిస్టులోనూ తమ పేర్లు లేవని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

తమ ఓట్లు లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్న కిర్రాబు గ్రామస్తులు

సీలేరు పోలింగ్ కేంద్రంలో ఓటేసేందుకు బారులుదీరిన ఓటర్లు

చింతూరులో సాయుధ బలగాల పటిష్ట భద్రత మధ్య కొనసాగుతున్న పోలింగ్

సీలేరులో 4 గంటలకే పోలింగ్ ముగించుకుని వెనుదిరుగుతున్న ఎన్నికల సిబ్బంది

మన్యంలో అవస్థల నడుమ
ప్రశాంతంగా పోలింగ్

అనంతగిరి మండలం గరుగుబిల్లిలో సెల్‌పోన్ల వెలుగులో పోలింగ్

సీలేరు మండలంలో వర్షంతో పోలింగ్‌కు ఇబ్బందులు

అల్లూరి సీతారామరాజు జిల్లాలోని రంపచోడివరం, పాడేరు, అరకు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో సోమవారం ఎన్నికల పలు అవస్థలు నడుమ ప్రశాంతంగా ముగిసాయి. మారుమూల గ్రామాల నుంచి గిరిజనులు పోలింగ్ కేంద్రాలకు నానా ఇబ్బందులు పడుతూ చేరుకుని ఓటు హక్కును వినియోగించుకున్నారు.రాళ్లు రప్పలున్న కొండమార్గంలో నడిచి రాలేని స్థితిలో ఉన్న ఓటర్లను వారి కుటుంబీకులు డోలీసాయంతో మోసుకొచ్చి మరీ ఓటేయించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతం కావడంతో సాయుధ పోలీసు బలగాల పటిష్ట భద్రత నడుమ పోలింగ్ జరిగింది. అల్లూరి మన్యంలో నెలకొన్న భౌగోళిక పరిస్థితులు, శాంతిభద్రతల సమస్య దృష్ట్యా ఉదయం ఏడుగంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకే పోలింగ్‌కు ఎన్నికల సంఘం అనుమతినివ్వగా, నిర్దేశించిన సమయంలోనే ఓటింగ్ ముగించుకుని ఎన్నికల యంత్రాంగం వెనుదిరిగింది. రంపచోడవరం డివిజన్, వై.రామవరం మండలంలోని మూడు కొండశిఖర గ్రాఃమాల్లో పోలింగ్ అనంతరం ఇవిఎంలు, వివి.ప్యాడ్‌లతోపాటు పోలింగ్ సిబ్బందిని స్ట్రాంగ్ రూంకు తరలించేందుకు రవాణా, ఇంకా శాంతిభద్రతల సమస్యలను దృష్టిలో పెట్టుకుని హెలీకాప్టర్ సౌకర్యం కల్పించారు. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఇవిఎంలు మొరాయించడంతో పోలింగ్‌కు అంతరాయం కలిగింది. సీలేరు, తదితర ప్రాంతాల్లో వర్షం వల్ల ఓటేసేందుకు వచ్చిన గిరిజనులు ఇబ్బందులు పడక తప్పలేదు. అనంతగిరి మండలం గరుగుబిల్లి పోలింగ్ కేంద్రంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో సెల్‌ఫోన్ల వెలుగులో ఓటింగ్‌ను కొనసాగించడం కొసమెరుపు. కాగా పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో అధికారులు, పోలీసు యంత్రాంగం ఊపిరిపీల్చుకుంది.

- ప్రజాశక్తి విలేకర్ల యంత్రాంగం

విఆర్.పురంలో పోలింగ్ కేంద్రం వద్ద వైద్యశిబిరం


రంపచోడవరంలో ఓటేసేందుకు వీల్‌చైర్‌లో వస్తున్న మహిళ

రంపచోడవరంలో పోలింగ్ కేంద్రం వద్ద భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎఎస్‌పి జగదీష్

లోతేరు పంచాయతీలో కనీస సౌకర్యాలు లేక మండుటెండలో మహిళా ఓటర్ల అవస్థలు

మారేడుమిల్లిలో మండుటెండలో ఓటేసేందుకు క్యూలైన్లలో ఉన్న ఓటర్లు

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

డుంబ్రిగుడ మండలంలో బారులు తీరిన ఓటర్లు

ప్రజాశక్తి:యంత్రాంగం

అరకులోయ:అరకులోయ మండలంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా జరిగింది. చిన్నచిన్న సమస్యలు తప్పా , సజావుగా జరగడంతో అధికారులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. మును పెన్నడూ లేని విధంగా ఐదున్నర గంటల నుంచి ఓటర్లు పోలింగ్ స్టేషన్‌ల వద్ద క్యూ కట్టారు.అరకులోయలోని 211, 237 పోలింగ్ స్టేషన్ నెంబర్లు కొంతసేపు ఈవీఎం మొరాయించాయి. సాయంత్రం 4 గంటల సమయానికి 55.85శాతం పోలింగ్ నమోదైంది. ఇండియా కూటమి సిపిఎం అరకు పార్లమెంట్ అభ్యర్థి పాచిపెంట అప్పలనర్స తన స్వగ్రామమైన అరకులోయ మండలం బొండం పంచాయతీ కేంద్రంలోని పోలింగ్ స్టేషన్లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. వైసిపి అరకు అసెంబ్లీ అభ్యర్థి రేగం మత్స్యలింగం మండలంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అరకులోయ మండలం కొత్తభల్లు గూడ పంచాయతీ కేంద్రంలోని పోలింగ్ స్టేషన్లో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ కోట ఎమ్మెల్సీ డాక్టర్ కుంభ రవిబాబు దంపతులు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇండియా పోరం కాంగ్రెస్ అసెంబ్లీ అభ్యర్థి శెట్టి గంగాధర్ స్వామి తన స్వగ్రామమైన అనంతగిరి మండలం శివలింగపురం గ్రామంలో తన ఓటు హక్కును వినియోగించు కున్నారు.

కొత్తభల్లుగూడ 238 పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న మైక్రో అబ్జర్వర్ వృద్ధులు, అంధుల ఓట్లను తానే వేస్తున్నట్లు కొంతమంది అరకు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి ఐటీడీఏ పీవో అభిషేక్‌కు ఫోన్లో ఫిర్యాదు చేశారు. స్పందించిన పిఒ ఆ పోలింగ్ స్టేషన్లో సందర్శించారు. ఒకరి ఓట్లు ఒకరు వేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కొత్త బళ్ళుగూడ పోలింగ్ స్టేషన్లో మంచినీరు, టెంట్ ఏర్పాటు చేయలేదు.

డుంబ్రిగుడ: మండలంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. పోలింగ్ ప్రారంభమైన కేంద్రాల్లో అక్కడక్కడ కొద్దిసేపు ప్రారంభంలో ఈవీఎంలు కొంతసేపు మొరాయించినప్పటికీ తర్వాత యధావిధిగా పోలింగ్ కొనసాగింది. మండల కేంద్రంలోని 175 పోలింగ్ కేంద్రం ప్రారంభంలో కొద్దిసేపు ఈవీఎం మొరాయించింది.మండల వ్యాప్తంగా 18 పంచాయతీలు ఉండగా 48 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు జరిగాయి. చంటి పిల్లలను చంకలో ఎత్తుకొని మహిళ ఓటర్లు ఓటు వేసేందుకు తరలి వచ్చారు. సాయంత్రం నాలుగు గంటలకు పోలింగ్ ప్రక్రియ ముగియాల్సి ఉన్నప్పటికీ ఆ సమయానికి ఓటర్లు బారులు తీరు ఉండటంతో ఓటు నమోదు ప్రక్రియను ఎన్నికల సిబ్బంది చేపట్టారు.

అనంతగిరి:మండలంలోని 24 పంచాయతీ పరిధి బూతు లలో ప్రశాంతంగా ఎన్నికలు జరిగాయి ఉదయం 6 గంటల నుండి బూతులలో ఓటర్లు క్యూ కట్టారు సాయంత్రం ఐదు గంటల సమయంలో మెరుపులు ఈదురుగాళ్లతో కూడిన భారీ వర్షం కురవడంతో విద్యుత్ అంతరం నెలకొంది నాన్ షెడ్యూల్ గరుగుబిల్లి పంచాయితీ బూత్ లో 1126 ఓటర్లు ఉన్నారు అయితే రాత్రి 7: 30 గంటల వరకు సెల్ ఫోన్లు టార్చ్ లైట్ లు వెలిగించి ఓటర్లను ఓట్లు వేయించిన పరిస్థితి ఏర్పడింది మండలంలో జరిగిన ఓటింగ్ శాతం పూర్తి వివరాలు రావలసి ఉంది

ఓటు వేసిన జెడ్పిటిసి గంగరాజు

అనంతగిరి: అనంతగిరి పంచాయతీ బాలికల పాఠశాల 1 పోలింగ్ బూత్‌లో సిపిఎం జెడ్పిటిసి దీసరి గంగరాజు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

పెదబయలు :సీతగుంట పంచాయతీ పెదబయలులోని మూడు పోలింగ్ కేంద్రాల్లో సాయంత్రానికి 68శాతం ఓట్లు పోలయ్యాయి. అరకు ఎమ్మెల్యే శెట్టి ఫాల్గుణ శికరి గ్రామంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. బిజెపి అభ్యర్థి పాంగి రాజారావు పెదబయలులో ఓటుహక్కు వినియోగించుకున్నారు.

జి.మాడుగుల: స్థానిక హై స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో వీల్ చైర్ ఏర్పాటు చేయక పోవడంతో వికలాంగులు, వృద్ధులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొన్నారు. మధ్యాహ్నం మూడు గంటల నుండి భారీ వర్షం కురవడంతో ఓటర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ముంచింగిపుట్టు : మండలంలో 23 పంచాయితీల్లో 50 పోలింగ్ బూత్ లు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాలలో తాగునీరు, టెంటు ఏర్పాటు చేయలేదు.

పాడేరు నియోజకవర్గంలో...

సీలేరు : పాడేరు అసెంబ్లీ నియోజకవర్గం పరిధి జికె.వీధి మండలం సీలేరు పోలింగ్ కేంద్రంలో ఉదయం 7 గంటలకే పోలింగ్ ప్రారంభమైంది. ఓటర్లు అధిక సంఖ్యలో ఓటు వేయడానికి రావడంతో మధ్యాహ్నం 12 గంటల సమయంలో 1, 2, 3 బూతుల్లో బారులు తీరారు. సీలేరు పంచాయతీ పరిధిలో 2840 మంది ఓటర్లు ఉండగా 1563 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. స్థానిక ఎస్సై రామకృష్ణ కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయడంతో సీలేరులో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. అనంతరం పోలీసులు భద్రత నడుమ ఈవీఎంలను పోలింగ్ సిబ్బంది ఆర్టీసీ బస్సులో తరలించారు. దుప్పిలివాడ పంచాయతీ పరిధి బూషి కొండలో ఓటర్లు 398 మందిగాను 262 మంది ఓటు వేశారు. జీకే వీధి మండలం గాలికొండ పంచాయితీ మావోయిస్టు ప్రభావత ప్రాంతం కావడంతో సప్పర్ల గ్రామంలో వారికి పోలింగ్ బూత్ ఏర్పాటు చేశారు. పరమ సింగవరం, దొరగోంది తదితర గ్రామాల ప్రజలకు వాహనాలు ఏర్పాటు చేశారు. జీకే వీధి మండలంలో మావోయిస్టు నుంచి ఎటువంటి ముప్పు లేకుండా జీకే వీధి సిఐలు అప్పలనాయుడు, అశోక్ కుమార్, ఎస్ఐ అప్పలసూరి డ్రోన్ కెమెరాల ద్వారా మావోయిస్టు కదిలికలపై 15 కిలోమీటర్ల మేర నిఘా పెట్టడంతో మారుమూల నుంచి వచ్చే గిరిజనులు ప్రశాంతంగా ఓటు వేశారు. రింతాడలో ఓటర్లు జోరు వానలోనూ ఓట్లు వేశారు.

కొయ్యూరు : మండలంలోని పలుచోట్ల ఇవిఎంలు మొరాయించడంతో గంట ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. మండలంలో జై మహా భారత్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బొంకు అర్జున్ రావు, జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థి దుమంతి నాగేశ్వరరావు తమ ఓటు హక్కుని వినియోగించుకున్నారు. శరవన్నపాలెంలో సాధారణ మహిళలతో కలిసి ఎంపీ గొట్టేటి మాధవి ఓటు వేశారు. మారుమూల గిరిజన గ్రామాలలో ఓటర్లు ఓటు వేయడానికి శ్రద్ధ కనబర్చారు.

ఓటు హక్కును వినియోగించుకున్న సిపిఎం అనంతగిరి జెడ్‌పిటిసి గంగరాజు

ముంచంగిపుట్టు మండలంలో బారులు తీరిన ఓటర్లు

సీలేరులో బారులు తీరిన ఓటర్లు

నేరాలు ఘోరాలు

ఘాట్‌రోడ్డులో వ్యాను బోల్తా
-15 మందికి స్వల్ప, ముగ్గురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి -అనంతగిరి : తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వెళుతున్న వ్యాన్ బోల్తా పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఈ ఘటన లో ముగ్గురి పరిస్థితి విషమం కాగా 15 మందికి స్వల్ప గాయాలు అయ్యాయి. పెద్దకోట పంచాయతీ పరిధి కివర్ల ఘాటి రోడ్డు కుడియా గ్రామం సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పెద్దకోట పంచాయతీ వేలమామిడి, సీడివలస పాటిపల్లి గ్రామాలకు చెందిన 35 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు బొలెరా వాహనంలో పెద్దకోట బూతులో ఓటు వేసేందుకు వెళ్తున్నారు. వాహనం బోల్తా పడటంతో 15 మందికి స్వల్ప, ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. అంబులెన్స్‌లో ఎస్.కోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ముగ్గురు పరిస్థితి విషమంగా ఉండటంతో కెజిహచ్‌కు రిఫర్ చేశారు.

ఇదిలా ఉండగా ఆయా గ్రామాలకు చెందిన ఓటర్లు అందుబాటులో ఉన్న వేలమామిడి బూతులో ఓట్లు వేయవలసి ఉంది. అధికారుల తప్పిదంతో సుమారు 20 కిలోమీటర్ల దూరం పెదకొట బూతులో వారి పేర్లను చేర్చారు. దీంతో, ఆ గ్రామానికి వెళుతున్న క్రమంలో ఈ ఘటన చోటుచేసుకుంది. సంబంధిత అధికారుల తప్పిదంతోనే ఓటర్లకు ప్రమాదం జరిగిందని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.గోవిందరావు, మండల కార్యదర్శి ఎస్, నాగులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మండలంలోని పలు పంచాయతీ పరిధి గ్రామాలతో పాటు పెద్దకోట పంచాయతీ పరిధి వేలమామిడి, పాటిపల్లి, సీడీవలస, గ్రామాలకు చెందిన ఓట్లు తారుమారైనాయని, సరి చేయాలని పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ఈ ప్రమాదంపై అధికారులే పూర్తి బాధ్యత తీసుకొని వైద్య సేవలందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

క్షతగాత్రులకు సిపిఎం నేతల పరామర్శ

దేవరాపల్లి : అల్లూరి జిల్లా అనంతగిరి మండలం పెదకోట పంచాయతీలో సోమవారం మధ్యాహ్నం జరిగిన ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను పినకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా, క్షేతగాత్రులను సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి వెంకన్న, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఇరట నరసింహ మూర్తి పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాలం మామిడిలో ఎన్నికల బూత్ ఉండగా బూత్ పరిధిలో ఉన్న గ్రామాల్లో కొంత మందికి ఓట్లు లేకపోవడంతో పెదకోట బూత్‌కు తరలించాల్సిన పరిస్థితి దాపురించిందని తెలిపారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈ ప్రమాదం జరిగిందన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని, రూ.10 లక్షలు ఎక్ష్ గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

పోలీసుల ముమ్మర తనిఖీలు

ప్రజాశక్తి- సీలేరు : ఎన్నికల నేపథ్యంలో ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల్లో మావోయిస్టు కదిలికలపై ఇరు రాష్ట్ర పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. తనిఖీలు ముమ్మరం చేశారు. ముందస్తుగానే అదనపు బలగాల మొహరించి ఏఓబి సరిహద్దును పోలీసులు ఆధీనంలో తీసుకున్నారు. మావోయిస్టు కదిలికలపైనే ఇంటెలిజెన్స్ వర్గాలు హెచ్చరికల నేపథ్యంలో పోలీసుల అప్రమత్తమై బాంబు స్క్వాడ్ బృందాలు, అదనపు పోలీసు బలగాలతో మావోయిస్టు ప్రభాత ప్రాంతాలను చుట్టుముట్టి పాగ వేశారు. మావోయిస్టులు ఎటువంటి చర్యలకు పాల్పడినా దీటుగా సమాధానం చెప్పడానికి బలగాలని సిద్ధం చేశారు. జీకే వీధి మండలం మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన గాలికొండ గుమ్మిరేవులు ప్రాంతాల్లో ఎన్నికల సమయంలో పోలింగ్ బూతులు వద్ద హిమసాత్మక సంఘటన చోటు చేసుకోకుండా చింతపల్లి సబ్ డివిజనల్ అడిషనల్ ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. ఎన్నికల్లో మావోయిస్టు నుంచి ఎటువంటి సంఘటనలు చోటు చేసుకోకపోవడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.ఈ కార్యక్రమంలో జీకే వీధి సీఐలు అప్పలనాయుడు, అశోక్ కుమార్, ఎస్ఐ అప్పలసూరి, సీలేరు ఎస్సై రామకృష్ణ పాల్గొన్నారు.

ఆంధ్ర ఒడిశా సరిహద్దుల్లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

ఓటర్లకు అభ్యర్థుల ధన్యవాదాలు

ప్రజాశక్తి-గాజువాక

ఈ ఎన్నికల్లో తనకు ఓటేసిన ఓటర్లకు, ప్రచారం చేసిన కేడర్‌కు, కష్టపడిన ప్రతి ఒక్కరికి ఇండియా ఫోరం బలపరిచిన గాజువాక నియోజవర్గం సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.జగ్గునాయుడు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎండ ఎక్కువగా ఉన్నా తాను తిరిగిన పోలింగ్ స్టేషన్లలో చాలావరకు తాగు నీటి సదుపాయం లేదని, టెంట్లు సరిగ్గా వేయలేదని తెలిపారు. ఈవీఎంలు మొరాయించడం వల్ల గంటల తరబడి క్యూ లైన్లలో ఓటర్లు నిలబడాల్సి వచ్చిందన్నారు. గాజువాకలో ప్రధానంగా అధికార వైసిపి, ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా బహిరంగంగానే డబ్బులు పంపిణీ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు.

తను ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ గాజువాక నియోజవర్గ టిడిపి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు ధన్యవాదాలు తెలిపారు. కొత్త గాజువాక ఎంపిపి స్కూల్‌లోని 197 పోలింగ్ కేంద్రం వద్ద పల్లా శ్రీనివాసరావు ఆయన భార్యతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఓటింగ్ సరళిని పరిశీలిస్తే తన గెలుపు ఖాయం అన్నారు.